క్లుప్తంగా

అన్నదమ్ముల కుటుంబాలు.. కర్రలతో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో అన్నదమ్ముల కుటుంబాలు ఆదివారం పరస్పర దాడికి పాల్పడ్డాయి. పోలీసుల వివరాల మేరకు.. తెనాలి మండలం ఖాజీపేటకు చెందిన అన్నదమ్ములు కాలిశెట్టి వెంకటేశ్వరరావు, కాలిశెట్టి శ్రీనివాసరావు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఆదివారం రెండు కుటుంబాలు ఘర్షణ పడ్డాయి. కర్రలతో దాడి చేసుకోవడంతో..ఇరు కుటుంబాల్లోని నలుగురు గాయాలపాలయ్యారు. ఇరు వర్గాలు పోలీసులను ఆశ్రయించగా రూరల్ పోలీసులు పరస్పర కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తెనాలిలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



తెనాలిఅర్బన్: జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్, ఎస్ఎస్ కంప్యూటర్ అకాడమి, గణేష్ మణికంఠ మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెట్టి విజయకృష్ణ, రమేష్, శివనాగరాజు, రాంబాబు, సీహెచ్.ఉమాదేవి, జె.ఎబినైజర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రుక్మిణీ కృష్ణుల కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట 2వ లైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకారక్షేత్రంలో సీతారామాంజనేయ నగర సంకీర్తనా సంఘం ఆధ్వర్యంలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. ఆదివారం రుక్మిణీ సమేత కృష్ణ భగవానుడికి విశేషార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బుజ్జి బృందం నిర్వహణలో వేద మంత్రాల నడుమ రుక్మిణి కృష్ణుల విశేషాలను వివరిస్తూ కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహాహారతి, మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ముప్పు హర గోపాల్ సోదరుల భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి మద్రామాయణ ప్రవచనం భక్తులను అలరించింది. కార్యదర్శి నంబూరి శ్రీవేంకటనారాయణమూర్తి పర్యవేక్షించారు.

ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసిన జమున

లక్ష్మీపురం: సినీ నటి జమున మరణంతో ఒక నాటి మేటి తారల తరం ముగిసినట్లు అయిందని, అనేక సినిమాల్లో అపూరూపమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల గుండెల్లో జమున చెరగని ముద్ర వేశారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సినీ నటి జమున సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెండి తెరను ఏలిన అభినయ తార జమున చలాకీ చిన్నదిగా, సత్యభామగా అభిమానుల మనసులు దోచిన వన్నెల దొరసానిగా పేరుగాంచారన్నారు. సంస్థ సీనియర్ సభ్యులు రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, పి.ఘన శ్యామాచార్యులు, సాయిబాబు, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, తదితరులు నివాళులర్పించారు.

వైభవంగా విజయ గణపతి స్వామి కల్యాణం

పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని విజయ గణపతి స్వామి అష్టాదశ(18) వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సిద్ధి బుద్ధి సమేత విజయ గణపతి స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహం, పంచ గవ్యారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, విశేష హోమం తదితర కార్యక్రమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

రాష్ట్ర ఫెన్సింగ్ పోటీల్లో దేవేందర్‌కు స్వర్ణం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 28న కర్నూలులో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడా విభాగంలో గుంటూరుకు చెందిన ముంజుంపల్లి దేవేందర్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, టీం ఈవెంట్‌లో కాంస్య పతకాలు గెలుపొందాడని శాప్ కోచ్ కె.సంగీత్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటాడన్నారు. దేవేందర్ విద్యనభ్యసిస్తున్న ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, యాజమాన్యం అభినందనలు తెలిపారన్నారు.

ద్విచక్ర వాహనాల సీజ్

గుంటూరు ఈస్ట్: నెంబర్ ప్లేట్లు లేని రెండు ద్విచక్రవాహనాలను పట్టాభిపురం పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం స్టేషన్ పరిధిలో గస్తీ నిర్వహించిన పోలీసులు నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న రెండు కేటీఎం బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

తెనాలి కలప ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా గుర్తింపు

– కార్పెంటర్స్ యూనియన్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, రాష్ట్ర నాయకులు

తెనాలి: కలప ఉత్పత్తులలో తెనాలి దేశవ్యాప్తంగా గుర్తింపును కలిగి ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన తెనాలి టౌన్ కార్పెంటర్స్ యూనియన్ ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక మారీసుపేటలోని చెంచురామానాయుడు మున్సిపల్ హైస్కూలులో జరిగింది. యూనియన్ అధ్యక్షుడు షేక్ సమీర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ.. కలప వ్యాపారానికి తెనాలి ప్రసిద్ధి అని, ఇక్కడి కార్పెంటర్లు, జంపనిలోని దారు శిల్పులు చేస్తున్న వివిధ రకాల ఫర్నీచర్, తలుపులు, దర్వాజాలు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారని గుర్తుచేశారు. యూనియన్ నాయకులు కోరినట్టుగా సంఘం భవన నిర్మాణానికి తగిన స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆటోనగర్ తరహాలో ఒక ప్రత్యేక ప్రదేశంలో కార్పెంటర్ పరిశ్రమ కేంద్రీకృతమయ్యేలా.. తక్కువ ధరలో స్థల కేటాయింపునకు పరిశీలిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ.. రెడీమేడ్ ఫర్నీచర్ రాజ్యమేలుతున్నా.. కార్పెంటర్లతో ఆర్డరిచ్చి చేయించుకున్న ఫర్నీచర్ నాణ్యతగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తుల వారికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నారని కొనియాడారు. ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, హెచ్ 195 రాష్ట్ర అధ్యక్షుడు వేముల కన్నా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పప్పసాని నాగేశ్వరరెడ్డి, గౌరవ అధ్యక్షుడు కందుకూరి రామోహ్మన్, కోస్తాంధ్ర అధ్యక్షుడు లక్కోజు సింహాచలం, గుగ్గిలపు శ్రీనివాస్, పపుదేశి చంద్రశేఖర్ ప్రసంగించారు. టౌన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జలదంకి రాఘవేంద్ర, కోశాధికారి పెరికల రాంబాబు, ఇతర పాలకవర్గ నాయకులు ఎం.అనిల్‌కుమార్, నల్లబోతుల శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కౌన్సిలరు షేక్ దుబాయ్ బాబు పాల్గొన్నారు.

సాయి భక్త బృందం వార్షికోత్సవం

పట్టణ గాంధీచౌక్‌లోని తెనాలి సాయి భక్తబృందం 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబాకి అభిషేకాలను చేశారు. 9 గంటలకు సాయి సత్యవ్రతం జరిపారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతినిచ్చి, అన్నప్రసాద వినియోగం చేశారు. ఈ వేడుకలో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరించారు. వీరితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ.సిరికృష్ణ, శానంపూడి రఘురామిరెడ్డి ఉన్నారు.

జయలక్ష్మికి మంత్రి నాగార్జున నివాళి



జయలక్ష్మి చిత్రపటం వద్ద మంత్రి నివాళి

తెనాలి: వైఎస్సార్ సీపీ యువజన విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడు బూరెల దుర్గాప్రసాద్‌కు ఇటీవల మాతృవియోగం కలిగిన విషయం విధితమే. దుర్గా ప్రసాద్ తల్లి జయలక్ష్మి సంస్మరణను ఆదివారం పట్టణంలోని నాజరుపేట మల్లాదివారి వీధిలో నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కార్యక్రమానికి విచ్చేసి, జయలక్ష్మి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. వీరితో వేమూరు మార్కెట్‌యార్డు డైరెక్టర్ బొల్లిముంత ఏడుకొండలు ఉన్నారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జయలక్ష్మి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. వైసీపీ నాయకులు కత్తెర సురేష్ బాబు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ కొల్లిపర అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, పార్టీ నేతలు కఠారి హరీష్, బండ్లమూడి భాస్కరరావు, కొలకలూరి నాగేశ్వరరావు, సిరికృష్ణ, శానంపూడి రఘురామిరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, రాంబాబు, హరిదాసు గౌరీశంకర్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, జనసేన నాయకుడు తోటకూర వెంకటరమణారావు తదితరులు జయలక్ష్మికి నివాళులర్పించారు.

క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించటమే కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ డీకే హరిణి

తెనాలి: క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించినప్పుడే.. వైద్య చికిత్సతో నయం చేసుకోవచ్చని.. లేకుంటే ప్రాణాంతకమయ్యే.. ప్రమాదం ఉందని.. ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ కిషన్ హెచ్చరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్, హ్యాపీ హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఆదివారం నిర్వహించాయి. హ్యాపీ హాస్పిటల్‌లో జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడారు.. రెడ్‌క్రాస్‌తో కలిసి క్యాన్సర్ వైద్య పరీక్షల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ డీవీకే హరిణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేస్తామని, వివాహితలు ఏడాదికి రెండుసార్లు ఈ పరీక్షను చేయించుకోవాలని సూచించారు. మనోరంజని, డాక్టర్ అరుణ్ తేజ, రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, హాస్పటల్ సిబ్బంది ఉదయ, సురేంద్ర పాల్గొన్నారు.

రోగి నిలబడి తీయించుకునే ఎంఆర్ఐ ప్రారంభం

వెన్నుముక సర్జరీలపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేసి ఎంఆర్ఐ వైద్య పరికరంను ప్రారంభించిన డాక్టర్ రాజశేఖరన్, పక్కన డాక్టర్ జె.నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా గుంటూరు కొత్తపేటలోని మల్లిక స్పైయిన్ సెంటర్‌లో నిల్చుని, కూర్చుని తీయించుకునే అత్యాధునిక అప్‌బ్రైట్ ఎమ్మారై మెషిన్‌ను ఆదివారం ప్రారంభించారు. కోయంబత్తూరు గంగా హాస్పటల్‌కు చెందిన డాక్టర్ ఎస్.రాజశేఖరన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి అత్యాధునిక ఎంఆర్ఐ మెషిన్‌ను ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల ద్వారా వెన్నుముక విరిగిన, వెన్నుముక సమస్యల ద్వారా వచ్చే పక్షవాతం, మంచానికే పరిమితమైన వారిని ఎవరిపై ఆధారపడకుండా జనజీవన స్రవంతిలో నిలిపే మల్లిక స్పైయిన్ రిహాబ్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా గుంటూరు మల్లికా స్పైయిన్ సెంటర్‌లో సైతం ప్రారంభించారు. ఈ ఆధునిక వైద్య సౌకర్యాలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని మల్లిక స్పైయిన్‌సెంటర్ అధినేత, సీనియర్ స్పైయిన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు కోరారు. స్పైయిన్ సొసైటీ ఆరో వార్షికోత్సవం సందర్భంగా లైవ్ సర్జరీలు చేశారు. ఏపీలో తొలిసారిగా జరిగిన లైవ్ సర్జరీల్లో వెన్నుముక ఆపరేషన్లలో పాటించాల్సిన మెలకువల గురించి, అతిచిన్న రంధ్రం ద్వారా వెన్నముక సర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతుల గురించి వివరించారు. ఎనిమిది సర్జరీలను డాక్టర్ నరేష్‌బాబు లైవ్ ద్వారా చేసి వివరించారు. డాక్టర్ రాజశేఖరన్ వెన్నుముకల్లో వచ్చే సాధారణ సమస్యల గురించి, 25 సంవత్సరాల స్పైయిన్ సర్జరీల అనుభవం గురించి ఓరియంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు, అసోసియేషన్ నేతలు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ధర్మారావు, డాక్టర్ అమర్‌నాథ్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండోలో విద్యార్థినికి బంగారు పతకం



తెనాలిఅర్బన్: జూనియర్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని శైలజ ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శనివారం బెంగళూరులో పోటీలు జరిగినట్లు ఆయన చెప్పారు. శైలజను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

చక్రాయపాలెంలో గంగమ్మతల్లి కొలుపులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

చక్రాయపాలెం(తెనాలి): నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం చక్రాయపాలెంలో శ్రీగంగమ్మతల్లి దేవస్థానం కొలుపులను ఆదివారం వైభవంగా జరిపారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొలుపుల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే శివకుమార్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. గ్రామ సర్పంచ్ చందు బాబూరావు, మాజీ సర్పంచ్ రెడ్రౌతు వెంకటేశ్వరరావు, రెడ్రౌతు బాలరాజు, అడపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'శ్రీనివాస కల్యాణం'పై బుర్రకథ ప్రదర్శన



బుర్ర కథ కళాకారులను సత్కరించిన శ్రీ కళారంజని సభ్యులు

తెనాలిటౌన్: పట్టణంలోని కళిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాలులో శ్రీ కళారంజని ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం అనే అంశంపై బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. కళారంజని అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతి అధ్యక్షత వహించి, మాట్లాడారు. ప్రాచీన జానపద కళా రూపాలలో ఒకటైన బుర్రకథ ప్రజలు హృదయాలకు చేరువైందన్నారు. గౌరవాధ్యక్షుడు ఆచార్య మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి బుర్రకథ ప్రభావితం చేసిందన్నారు. అనంతరం భాగవతారిణి, నాట్యమయూరి వి.భానుమతి, వాక్చాతుర అమృతవల్లి ఎ.లక్ష్మీజ్యోతిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకా పేరిరెడ్డి, సందీప్‌కుమార్, ఎస్.హనుమారెడ్డి, పీజే ప్రసూనాంబ, సెక్రటరీ జి.మురళీకృష్ణ, వాకా కరుణ, శ్రీ కళారంజని సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

బాపట్ల ఐటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి



పెదపులుగువారిపాలెం గ్రామస్తులకు అవగాహన కల్పించిన అధికారులు

పెదపులుగువారిపాలెం(కర్లపాలెం): ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజలు సిద్ధంగా ఉండాలని బాపట్ల ఐటీసీ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కర్లపాలెం మండలంలోని పెదపులుగువారిపాలెంలో ఆదివారం ఏపీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ, ఎస్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు పశువుల ప్రాణాలను కాపాడుకోవటం, ఆస్తులను భద్రపరుచుకోవటం, ఆహార పదార్థాలు, తాగునీటిని సమకూర్చుకోవడం, అగ్ని ప్రమాదంలో, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించుకోవడం వంటి అంశాలపై ఆపద మిత్రలకు శిక్షణ ఇచ్చి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదలు, సునామీలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులు, ఆపద మిత్రలు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు.. వారికి కావాల్సిన ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని చెప్పారు. నష్ట పరిహారం పొందాలంటే రైతులు సాగు చేసే పంటలు ఈ–క్రాప్ బుకింగ్ చేసి ఉండాలని, ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. నీటిలో మునిగిపోయే వారిని ఎలా రక్షించుకోవాలో గ్రామ సమీపంలో ఉన్న కాంప్ డ్రెయిన్‌లో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ పులుగు సుబ్బారెడ్డి, ఫైర్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, బాపట్ల ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ రఘుబాబు, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రమణయ్య, నిర్వాహకులు

తెనాలిటౌన్: గాంధీనగర్‌లోని షిరిడిసాయి వృద్ధాశ్రమం, కొల్లావారి వీధిలోని మహాత్మ శాంతి సేవా ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం ఎస్వీయోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. యోగ సభ్యులు కనకమేడల పుష్పకుమారి పర్యవేక్షణలో కాజా సతీష్‌బాబు 9వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు వృద్ధులకు అన్నదానం చేశారు. కాజా సుబ్బారావు, వరలక్ష్మి, ఉమామహేశ్వరి, జగదీశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద పేదలకు అన్నదానం చేశారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



తెనాలిటౌన్: దేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడా యాత్రకు మద్దతుగా ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో ర్యాలీ జరిపారు. చేయి చేయి కలుపుదాం --కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, పి.శివకుమార్, బుల్లయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించేవరకు ఉద్యమిస్తాం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



బస్సు యాత్రలో మాట్లాడుతున్న రమాదేవి

బాపట్ల: ప్రత్యేకహోదా సాధించే వరకు ఉద్యమిస్తామని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలు చేపట్టిన బస్సు యాత్ర బాపట్లకు ఆదివారం చేరుకుంది. స్థానిక పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా సాధించుకుంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల్లో కేంద్రం వాటా పెరుగుతుందన్నారు. దీంతో రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, జాన్సన్‌బాబు, సుభానీ, లెనిన్‌బాబు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.

రైతాంగ జీవనానికి దర్పణం 'నాగలికి నా నమస్కారం'



పుస్తకాన్ని ఆవిష్కరించిన భవాని దేవి, పాల్గొన్న నాగరాజ్యలక్ష్మి, తదితరులు

పాత గుంటూరు: సగటు రైతు శ్రమను, చెమట చుక్కను గౌరవించిన నాడే మట్టి బంగారం అవుతుందని, అన్నం ముద్ద ఆకలి తీరుస్తుందని తన కవిత్వం ద్వారా చాటి చెప్పిన మహనీయుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య అని రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలోని జాషువా కళా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య కలం ద్వారా జాలువారిన 'నాగలికి నా నమస్కారం' పుస్తకాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ నేపథ్యమే వెంకటసుబ్బయ్య కవితా వస్తువు అన్నారు. నానీల కవిత సంపుటిపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎన్వీ కృష్ణారావు, పత్రిక సంపాదకులు చలపాక ప్రకాష్ సమీక్షించారు. కార్యక్రమాన్ని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, ఎన్వీ సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ పలు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఆటో డ్రైవర్ దాడి

గుంటూరు ఈస్ట్: ప్రయాణికులపై ఓ ఆటో డ్రైవర్ దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరండల్‌పేట 15వ లైనులో నివసించే రవి, అతని కుమారుడు ఆదివారం బస్టాండు నుంచి ఇంటికి ఆటోలో చేరుకున్నారు. ఆటో దిగి డబ్బులు ఇచ్చే క్రమంలో ఆటో డ్రైవర్‌కు, రవికి బాడుగ వ్యత్యాసం రావడంతో ఇరువురు గొడవపడ్డారు. ఆటో డ్రైవర్ రవిని అతని కుమారుడిని కొట్టి గాయపరిచాడు.

అగ్నికి పూరిల్లు ఆహుతి



ఇంటితోపాటు దగ్ధమైన పిండి మర యంత్రం

కొల్లూరు: అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని గాజుల్లంకలో చోటుచేసుకుంది. బాధితులు, రెవెన్యు సిబ్బంది వివరాల మేరకు.. చందనం రాంబాబు అనే వ్యక్తి తన పూరింట్లోనే పిండి మర యంత్రం పెట్టుకుని జీవన సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లోని వ్యక్తులందరూ.. సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో ఇంటి నుంచి మంటలు రావడంతో.. గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ.. పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తెలుస్తోంది. ఇంటిలోని బీరువాలో ఉంచిన నాలుగు సవర్ల బంగారు ఆభరణాలతోపాటు, రూ.లక్ష నగదు, సామగ్రి మంటల్లో కాలిబూడిదయ్యాయని బాధితుడు వాపోయాడు. సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. సర్పంచ్ సనక వెంకట్రావు బాధితులకు రూ. 5 వేలు నగదు సాయం అందించారు.

నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యం రావాలి



జిల్లా శాఖ నూతన కార్యవర్గంతో కలిమిశ్రీ, రమణ యశస్వి, తదితరులు

పాత గుంటూరు: నేటి కాలమాన పరిస్థితులకు అద్దంపట్టే సాహిత్యాన్ని అందించాల్సిన బాధ్యత సాహిత్య సంఘాలపై ఉందని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ హాలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా శాఖ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ, ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రచయిత విడదల సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ పోటీల్లో బహుమతులు, ప్రభుత్వ పురస్కారాల కోసం రచయితలు రచనలు చేయకూడదన్నారు. సినీ గేయ రచయిత వేటూరి జయంతి, గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని విజయగోలి కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జిల్లా శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ జానీ బాషా, ఉపాధ్యక్షులుగా కాకరపర్తి సుబ్రహ్మణ్యం, సభ్యులుగా విజయ గోలి, విష్ణు మొలకల భీమేశ్వరప్రసాద్, ఆళ్ళ నాగేశ్వరరావు, కారంచేటి విజయకుమార్, కోట లీలాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధిగా బండికల్లు జమదగ్ని బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకటరమణ, రచయిత్రులు పోగుల విజయశ్రీ, సిహెచ్ సుశీలమ్మ, డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అలరించిన గ్రాండ్ మ్యూజికల్ నైట్



పాత గుంటూరు: రాజాగారితోటలోని వేంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం, ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని ఆదివారం గ్రాండ్ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను అలరించింది. గాయకులు పలు చిత్రాల్లో ని పాటలను ఆలపించారు. అనంతరం ప్రముఖ నటు డు నాయుడు గోపి, కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, డాక్టర్ నిమ్మల శేషయ్య, రచయిత పి.సూర్యనారాయణ, గాయకులు కె.రామ్‌దాస్‌కు ఎన్టీఆర్ సేవా పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నక్కా ఆనందబాబు, కన్నా మాష్టారు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షుడు దేవరకొండ బాలస్వామి, కార్యదర్శి కె.బాబూరావు పర్యవేక్షించారు.